

3 లో
ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :244 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 30 జూలై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

- లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం
- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా మిగతా 2లో...

## ఫ్యూయల్ స్విచ్‌లో లోపం లేదు..

- ఎయిరిండియా ప్రమాదంపై ప్రభుత్వం కీలక ప్రకటన
- పరీక్షల్లో అసాధారణంగా ఏమీ కనిపించలేదని వెల్లడి
- థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్‌పై దర్యాప్తు కొనసాగుతుందన్న కేంద్రం
- తుది నివేదిక చివరి దశలో ఉందని వెల్లడి
- పార్లమెంటులో వివరాలు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం



**సింధూరదర్శిని:** అహ్మదాబాద్‌లో గతేడాది జూన్ 12న కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ ప్రమాదంపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ ప్రమాదంలో విమానంలోని ప్రయాణికులు, సిబ్బందితో పాటు నేలపై ఉన్నవారూ కలిపి 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిపై నిర్వహించిన అధునాతన పరీక్షల్లో ఎలాంటి సాంకేతిక లోపం గుర్తించలేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌కు తెలిపింది. రాజ్యసభలో కేంద్ర పౌర విమాన యాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ ఈ వివరాలు వెల్లడించారు. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌ను తయారీ సంస్థ వద్ద సమగ్రంగా పరీక్షించగా, లాకింగ్ వ్యవస్థలో అసాధారణంగా ఏమీ కనిపించలేదన్నారు. డీజీసీఏ ఆదేశాల మేరకు విమాన భద్రతా తనిఖీల్లో భాగంగా ఈ పరీక్షలు మిగతా 2లో...

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది: జగన్

- -భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ తన ఖాతాలోకి వేసుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్న జగన్
- -విమానాశ్రయానికి సంబంధించిన అన్ని పనులు తమ హయాంలోనే జరిగాయని వ్యాఖ్య
- -2026 నాటికి విమాన రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామన్న జగన్



**అమరావతి, సింధూరదర్శిని:** భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ దారులు వెతుకుతున్నారని, కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమవుతున్న

## ఈనెల 31తో గడువు ముగుస్తుంది

### రైతులందరూ వెంటనే పంటల బీమా చేయించుకోండి: మంత్రి అచ్చెన్నాయుడు

చివరి రోజు వరకు వేచి చూడొద్దు... ఇప్పుడే నమోదు పూర్తి చేసుకోండి



**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్రంలోని రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా నమోదును జూలై 31వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, మిగతా 2లో...

## ఏపీలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి

సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్‌లతో తైవాన్ ప్రతినిధి బృందం భేటీ

**అమరావతి, సింధూరదర్శిని:** ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కనస్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, మిగతా 2లో...




## ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం

గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





**అమరావతి, సింధూరదర్శిని:** 'ప్రకృతి మనకు చెందినది కాదు... మనమే ప్రకృతికి చెందినవాళ్లం. అందుకే ప్రకృతితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణపైనా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అదే దృక్పథంతో మానవ, ఏనుగు సంఘర్షణలను తగ్గించడానికి గుచ్చిమి ఎలిఫెంట్ మిగతా 2లో...

## ఆంధ్రప్రదేశ్‌కు హాకీ, ఫుట్బాల్ మైదానాల కోసం కేంద్రమంత్రికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లేఖ

- రూ.25 కోట్లతో రాయచోటిలో అంతర్జాతీయ క్రీడా సముదాయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి
- 24.90 ఎకరాల్లో హాకీ, ఫుట్బాల్ క్రీడా మైదానాల ఏర్పాటుకు కేంద్ర సహకారం కోరిన మంత్రి
- డిల్లీలో కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భేటీ



**న్యూఢిల్లీ:** అన్నమయ్య జిల్లా రాయచోటిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ మైదానం, ఫుట్‌బాల్ మైదానం, ఫ్లడ్‌లైట్లు, ప్రేక్షకుల గ్యాలరీతో కూడిన అత్యాధునిక క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేంద్ర యువజన వ్యవహారాలు, మిగతా 2లో...

## ఆంధ్రప్రదేశ్‌కు హాకీ, ఫుట్బాల్ మైదానాల కోసం కేంద్రమంత్రికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లేఖ

(మొదటిపేజీ తరువాయి)

క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి సహకారం కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసిన మంత్రి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి స్థాయి అంతర్జాతీయ ప్రమాణాల ఫుట్‌బాల్ మైదానం లేదని పేర్కొన్నారు. రాయచోటిలో ఇందుకోసం 24.90 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టవచ్చని వివరించారు. రాయచోటి, పరిసర ప్రాంతాల్లో ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో విశేష ప్రతిభ కలిగిన యువతకు ఈ క్రీడా సముదాయం ఎంతో ఉపయోగపడుతుందని, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంటూ, దీనికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

(మొదటిపేజీ తరువాయి)

కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

## ఫ్యూయల్ స్విచ్‌లో లోపం లేదు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించినట్లు చెప్పారు. అయితే పూర్తి స్థాయి థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్ పరిశీలన ఇంకా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అమెరికాలోని సియాటిల్‌లో ఉన్న తయారీ కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరీక్షల ఫలితాల కోసం దర్యాప్తు అధికారులు ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రమాదంపై విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తుది నివేదిక ఆలస్యమైందన్న విమర్శలను కూడా ప్రభుత్వం తోసిపుచ్చింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తునకు నిర్దిష్ట కాలపరిమితి ఉండదని స్పష్టం చేసింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన వెంటనే తుది నివేదికను ఏఏఐబీ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది.

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ... "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని స్పష్టం చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే... ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

## ఈనెల 31తో గడువు ముగుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

అకాల వర్షాలు, వరదలు, కరువు వంటి అనూహ్య పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతు కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచేది పంటల బీమా మాత్రమేనని ఆయన అన్నారు. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున ఒక్క రైతు కూడా ఈ అవకాశాన్ని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. రైతులు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు.

గడువు ముగిసిన అనంతరం నమోదు అవకాశం ఉండకపోవచ్చని, అందువల్ల ప్రతి రైతు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పంట సాగు కోసం రైతు ఏడాది పొడవునా పడే శ్రమకు భద్రత కల్పించే ముఖ్యమైన సాధనం పంటల బీమా అని పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం పంటల బీమా నమోదును సులభతరం చేసిందని మంత్రి తెలిపారు. PMFBY Crop Insurance Farmer App ద్వారా రైతులు స్వయంగా బీమా నమోదు చేసుకోవచ్చని, అలాగే కామన్ సర్వీస్ సెంటర్లు, సంబంధిత బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రామ, మండల వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో కూడా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని వివరించారు. బీమా నమోదు సమయంలో అవసరమైన పత్రాలు, భూమి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర సమాచారాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత రసీదు లేదా ధ్రువీకరణ వివరాలను తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి అర్హ రైతు పంటల బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. రైతు ఏడాది శ్రమను కాపాడేది పంటల బీమా. కాబట్టి జూలై 31 గడువు ముగిసేలోపు ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకుని తమ పంటలకు పూర్తి భద్రత కల్పించుకోవాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోసారి విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

**ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు**

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తో తైవాన్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగ-సన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్- ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

## ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

క్యాంప్‌ను ఏర్పాటు చేశామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారు బుధవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఌ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. అడవి ఏనుగుల సంచారాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం, దశాబ్దాల నుంచి ఉన్న మానవ--ఏనుగు సంఘర్షణను నివారించడమే లక్ష్యంగా ఈ శిబిరం పని చేయనుంది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించడం, రైతుల పంటలను ధ్వంసం చేయడం, ప్రజలు రాత్రివేళ భయాందోళనల మధ్య జీవించడం వంటి సమస్యలు పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నప్పుడు పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, కొంత మంది స్థానిక ప్రజలు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటుచేశాం. ఉత్తరాంధ్రలో మానవ--ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.

**అదే విజయం రిపీట్ కావాలి**

గతంలో పలమనేరు ప్రాంతంలో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్లలో కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుతో పాటు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పని చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా మానవ--ఏనుగు సంఘర్షణల కారణంగా సంభవించే మరణాలను 70 శాతానికి పైగా తగ్గించడంతోపాటు, పంట నష్టాలను కూడా గణనీయంగా తగ్గించగలిగారు. అదే విజయాన్ని ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య సహజీవనానికి వేదికగా ఈ గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలవాలనే ఆశతో దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నాను.

కర్ణాటక ప్రజలు, ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు పార్వతీపురం జిల్లాలో ఈ రోజు మనం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారం. మన విజ్ఞప్తిని గౌరవించి, ఎంతో ఆప్యాయతతో నాలుగు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించడం వారి గొప్ప మనసుకు, స్నేహభావానికి నిదర్శనం. ఏనుగులను ఇవ్వడం అనేది సంపద ఇచ్చినట్లు అక్కడ ప్రజలు భావిస్తారు. అయినా తెలుగు ప్రజల రక్షణ కోసం ప్రేమతో కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించిన కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, అప్పటి అటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తున్నాము. వారి సహకారం, స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెంచాయి" అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ్‌చంద్ర, పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, శాసనసభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నందిని సలారియా, విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కె.వి.రాజు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి శ్రీమతి ప్రసూన పాల్గొన్నారు.

## తక్కువ ధరకే బియ్యం అమ్మకాలపై విస్తృత ప్రచారం చేయండి

**బియ్యం నాణ్యత విషయంలో రాజీ పడొద్దు - రాష్ట్ర వ్యాప్తంగా సమన్వయం అవసరం - జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షణ ఉండాలి**

**తక్కువ ధరలకే బియ్యం అమ్మకాల సన్నద్ధతలపై టెలీకాన్ఫరెన్సు నిర్వహించిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్**

తెనాలి సింధూరదర్శిని: ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరలకు బియ్యం అమ్మకాలపై విస్తృత ప్రచారం నిర్వహించండి. ప్రజలకు ఆర్థికంగా సాంత్వన చేకూర్చే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ సూచించారు. తక్కువ ధరకే అందించే బియ్యంలో నాణ్యత ఏ మాత్రం తేడా రాకుండా మిల్లర్లు చూసుకోవాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ఆగస్టు 1వ తేదీ నుంచి మొదలు పెట్టబోతున్న బియ్యం అమ్మకాలపై సన్నద్ధత గురించి జిల్లాల జాయింట్ కలెక్టర్లు, రైస్ మిలర్ల అసోసియేషన్ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో ప్రత్యేకంగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ "రాష్ట్రం ఒకయూనిట్‌గా పరిగణించి బియ్యం సర్దుబాట్లు జరగాలి. విశాఖపట్నం లాంటి జిల్లాలో మిల్లర్లు తక్కువ ఉంటారు... అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.ఇలాంటి ప్రాంతాలకు అధికంగా బియ్యం అందుబాటులో ఉంటే జిల్లాల నుంచి తరలించాలి. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వేదికగా అమ్మకాలు, వినియో గదారుల కొనుగోళ్లు, వారి ఫీడ్ బ్యాక్ తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ పనిచేస్తుంది. దాని



ద్వారా ఏ జిల్లాలో డిమాండు ఉంది..? అక్కడ తీసుకోవల్సిన చర్యలను జాయింట్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి. అలాగే బియ్యం కౌంటర్లలో తప్పనిసరిగా ఆధార్ నంబరును నమోదు చేయండి. దీనివల్ల బియ్యం పక్కదారి పట్ట కుండా ఉంటాయి. నెల్లూరు లాంటి జిల్లాల్లో సరిహద్దుల వద్ద ధాన్యం వేరే రాష్ట్రాలకు తరలిపోకుండా పటిష్టంగా నిఘాను పెంచుతున్నాం. దీనివల్ల రాష్ట్రంలోని రైసు మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు పెరుగుతాయి. ధరలు తగ్గుతాయి. ఆ దిశగానూ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాం.

**యూనిఫార్మల్‌గా పాయింట్లు ఉండాలి**

రైసు మిల్లర్లు వేగంగా పాయింట్ల ఏర్పాటుకు సన్నద్ధం అవ్వాలి. ప్రతి జిల్లాలోనూ రైసు మిల్లర్ అసోసియేషన్ సమావేశాలు నిర్వహించుకొని వేగంగా ఏర్పాట్లు చేసుకోండి. పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అవసరం అయిన బ్యాగులు, పాయింట్ల డిజైన్ వంటివి యూనిఫార్మల్‌గా వస్తాయి. బియ్యం అమ్మకాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. మిల్లర్ల వద్ద ఉన్న మొత్తం బియ్యంలో 10 శాతం ఇచ్చేలా, అవి కూడా బీపీటీ స్టీమ్, రా రైస్ ఇచ్చేలా చూడాలి. నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ప్రజలకు అందించే బియ్యం విషయంలో తేడాలొస్తే సహించేది లేదు. గతంలో రైతు బజార్లలో పెట్టిన కౌంటర్లకు మంచి స్పందన వచ్చింది. జాయింట్ కలెక్టర్లు ఆయా జిల్లాల్లో పెడుతున్న పాయింట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది." అని అన్నారు. కాన్ఫరెన్సులో పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, డైరెక్టర్ నఫూర్, రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుమ్మడి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం

పూతలపట్టు సింధూరదర్శిని:కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తవణంపల్లి మండలం నలిశెట్టిపల్లి గ్రామంలో ఇంటింటికీ ప్రజా సంక్షేమ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేంకటేశ్ చౌదరి, ఏఎంసి చైర్మన్ భాస్కర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్



ఎం.ఆర్.సి మోహన్ నాయుడు, మరియు దిలీప్ నాయుడుతో పాటు ఇతర స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ

## జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



రేణిగుంట( సింధూర దర్శిని) 29 జూలై తిరుపతి జిల్లా ; విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రేణిగుంటలోని ఏపి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, హాస్టల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదులను, పాఠశాల ఆవరణలో రక్షిత తాగునీరు, తదితర మౌలిక వసతులను పరిశీలించారు. హాస్టల్ లో లైట్ లు ఫ్యాన్ లకు అవసరమైన మరమ్మత్తులు చేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజన వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫారం లు, షూ లు సక్రమంగా అందుతున్నాయా, మధ్యాహ్న భోజన నాణ్యతా తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రవి కాంత్, వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

## జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి (సింధూర దర్శిని) 29 జూలై తిరుపతి జిల్లా ; క్రాఫ్ట్ విలేజ్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో క్రాఫ్ట్ విలేజ్ పై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, డీఆర్‌డీఏ సమన్వయంతో మొత్తం 3 ఎంపోరియం బ్లాక్‌లు, 3 వర్క్ షెడ్లు మరియు మరుగుదొడ్డి సౌకర్యంతో కూడిన 1 శిక్షణ తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిర్మాణ పనులను రోడ్లు మరియు భవనాల శాఖ టెండర్ విధానంలో చేపట్టిందని తెలిపారు. మొత్తం 3 ఎంపోరియం బ్లాక్ లు, శిక్షణ తరగతి గది నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. 3 వర్క్ షెడ్లలో 1 వర్క్ షెడ్ నిర్మాణం పూర్తికాగా, మిగిలిన 2 వర్క్ షెడ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయ్యాయన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను సంబంధిత శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, డిఆర్డిఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు డిఆర్డిఏ పిడి లు శోభన్ బాబు, శ్రీదేవి, ఏడి హ్యాండి క్రాఫ్ట్ సత్యమూర్తి, ఆర్ అండ్ బి ఈఈ రాజా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



శ్రీకాళహస్తి(సింధూర దర్శిని) 29 జూలై తిరుపతి జిల్లా జిల్లా ; శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎర్రగుడిపాడు ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి తో పాటు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రమీల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయుటకు రోటరీ క్లబ్ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు కార్యదర్శి మ్యాగీ క్లారా మాట్లాడుతూ పేద విద్యార్థులను విద్యలో అభివృద్ధి సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని విద్యకు పేదరికం అడ్డు కాదని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలు చేరుకోవాలని కోరారు అడ్వకేట్ ఉమా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్సిల్స్ పెన్స్ భోజనం ప్లేట్స్ పంపిణీ చేశారు కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రమీల తరుణ్ ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు స్వీట్స్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.



# భోగాపురం విమానాశ్రయ ప్రారంభానికి ఉత్తరాంధ్ర సిద్ధం

**మూడు లక్షల మందితో విజయవంతం చేయడమే లక్ష్యం**

**విజయనగరంలో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు: మంత్రులు నారాయణ, గొట్టిపాటి**



విజయనగరం: ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయనగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవం విజయవంతం కోసం మంత్రులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ స్థానిక నాయకులను సమన్వయం చేస్తున్నామని చెప్పారు. సుమారు మూడు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున రవాణా, భద్రత, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించామని, VMRDA నిధులతో =ం. 21 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. అదనంగా నగర అభివృద్ధి కోసం మరో 20 కోట్ల నిధులు మంజూరు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న కాలంలోనే భోగాపురం విమానాశ్రయానికి పునాది పడిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు నిర్లక్ష్యానికి గురైనప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందన్నారు. ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం ఇప్పటికే ప్రాంతంలో విస్తృతంగా పర్యటిస్తున్నామని చెప్పారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, ట్రాఫిక్, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై ప్రాంతీయ సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. విజయనగరంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# నేడు మనుబోలు గ్రామపంచాయతీలో పల్లెవీక్షణ

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు (సింధూరదర్శిని) 29 జూలై నెల్లూరు జిల్లా; గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన "పల్లెవీక్షణ" కార్యక్రమం ఈనెల 30న (గురువారం) మనుబోలు గ్రామ పంచా యతీలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామం లో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను సమీక్షించనున్నారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ ముందుగా యాచవరం ప్రాంతంలో విబిజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కాలువ పునరుద్ధరణ పనులను పరి శీలిస్తారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి



సౌకర్యాలను సమీక్షిస్తారు. అలాగే మనుబోలు గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలిస్తారు. మనుబోలు సచివాలయంలోని రైతు సేవా కేంద్రంలో ఛాంపియన్ రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించడంతో పాటు రైతులకు కిట్లు, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస విత్తనాలు, పశువుల మేత పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

వెలుగు--సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలెక్టర్ సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. అనంతరం గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు





గూడూరు (సింధూరదర్శిని) 29 జూలై నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి బాబా వారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గత వారం రోజుల నుంచి జరుగుతున్న ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ఎక్కడ నామ సప్తాహం ముగిసాయి పలు రకాల పుష్పాలతో బాబా వారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు సాయి సత్య వ్రతం నిర్వహించారు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# పిల్లలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే 1098కు ఫోన్ చేయండి

**బాల కార్మికులు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ**

**పిల్లల హక్కులను కాలరాసే వారిపై కఠిన చర్యలు తప్పవు**

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు**



నెల్లూరు( సింధూర దర్శిని) 29 జూలై నెల్లూరు జిల్లా ; పిల్లల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎక్కడైనా పిల్లలపై వేధింపులు, దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ కు సమాచారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సురక్షితంగా, విద్యావంతుడిగా, ఆరోగ్యవంతంగా ఎదిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

పిల్లల్లో పెరుగుతున్న చెడు అలవాట్లు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారులను నేర కార్యకలాపాలకు వినియోగించే ధోరణిపై కమిషన్ సభ్యులు, నిపుణులతో కలిసి విస్తృత అధ్యయనం నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, అందులోని సూచనల ఆధారంగా పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావంతో పిల్లలు మానసిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి అవగాహన కల్పించే ప్రత్యేక రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం పిల్లల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు పూర్తిస్థాయిలో వారికి ఉపయోగపడేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన సీట్ల అమలుపైనా ప్రత్యేక దృష్టి సారించి, ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చైర్మన్ స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారు, బాల్య వివాహాలకు పాల్పడే వారు, చిన్నారులను డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి నేరాలకు వినియోగించే ముఠాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నేరాల బారిన పడకుండా కాపాడటం సమాజం, ప్రభుత్వ యంత్రాంగం, తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి బాలుడు విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో అమలులో ఉన్న విద్యా హక్కు చట్టం, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల ఉచిత విద్య, పౌష్టికాహార పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ప్రతి చిన్నారి చదువును కొనసాగించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ సమాచారంతో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 17 మంది చిన్నారులను గుర్తించి అధికారులకు అప్పగించినట్లు వివరించారు. వారికి రక్షణ కల్పించి సంరక్షణ గృహాల్లో చేర్చే చర్యలు చేపట్టామని తెలిపారు.రాబోయే రోజుల్లో చైల్డ్ లైన్--1098, పోలీసు శాఖ, రైల్వే పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, డీజీపీ యూనిట్, రైల్వే శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం, తప్పిపోయిన చిన్నారులను రక్షించడం, తల్లిదండ్రుల వద్దకు చేర్చడం, కౌన్సెలింగ్ అందించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని వెల్లడించారు.పిల్లలకు ఎక్కడైనా అన్యాయం జరిగినా, వారి హక్కులకు భంగం కలిగినా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, వేధింపులు లేదా దోపిడీ ఘటనలు కనిపించినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని రాష్ట్ర ప్రజలకు చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఫిర్యాదుపై కమిషన్ తక్షణమే స్పందించి బాధిత చిన్నారికి రక్షణ కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ అమలు

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల- ప్రతి బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం, విద్య అందించి నెల్లూరును 'చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లా'గా తీర్చిదిద్దాలి**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు**




నెల్లూరు( సింధూర దర్శిని) 29 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లాలో బాలల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ వ్యవస్థపై ఐసిడి ఎస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు, హాస్టళ్ల సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత హాజరై శాఖల వారీగా బాలల సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి చిన్నారికి ఆరోగ్యం, విద్య, భద్రత కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు బాలల సమగ్ర అభివృద్ధిలో ఐసీడీఎస్, వైద్య, విద్య, పోలీసు, కార్మిక తదితర శాఖల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. గిరిజనులు, అనాథ పిల్లల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో తెలంగాణలో ఉన్న బాల కార్మికులను, వారి తల్లిదండ్రులను సురక్షితం గా జిల్లాకు తీసుకువచ్చి, పిల్లలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న నెట్వర్క్‌ను గుర్తించి చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లా కార్మిక శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇటుక బట్టీలు, రొయ్యల చెరువులు, పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 155 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేసి, బాలల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసు కుంటున్నామని వివరించారు.బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించిన లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచి ంచారు. బాలల పరిరక్షణ, అభివృద్ధి, విద్యా వికాసాన్ని బలోపేతం చేయడమే కమిషన్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పిల్లల భవిష్యత్తు కోసం సమర్థవంతంగా వినియోగించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యాహక్కు చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ నెల్లూరును 'చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లా'లిలిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలను సందర్శించి బాలల హక్కుల అమలు తీరును సమీక్షిస్తామని తెలిపారు.కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత మాట్లాడుతూ, రెండు రోజుల పర్యటనలో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్ది 15 రోజుల్లోగా కమిషన్‌కు నివేదికలు సమర్పించాలని అధి కారులను ఆదేశించారు. బాలల పరిరక్షణ కమిషన్ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తుం దని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బాలల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో చట్టం అమలు, బాలల రక్షణ, పునరావాసం తదితర అంశాలపై చేపడుతున్న చర్యలను కమిషన్‌కు వివరించారు.ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, జువైనల్ జస్టిస్ బోర్డు అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



## మల్దేవి కెనాల్‌పై వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కోవూరు ఎమ్మెల్యే

కోవూరు (సింధూర దర్శిని) 29 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాళెం-చెన్నూరు రోడ్డు మధ్య మల్దేవి కెనాల్‌పై నిర్మిస్తున్న వంతెన పనులను కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పరిశీలించారు. దాదాపు రూ. 2కోట్ల వ్యయంతో ఈ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వంతెన పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## అంబరాన్నంటిన గురు పౌర్ణమి సంబరాలు




రామసముద్రం (సింధూరదర్శిని): మండలంలో గురు పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ వాలీశ్వర స్వామి ఆలయంలో వెలసి ఉన్న శ్రీ సాయిబాబా స్వామి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణము నందు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయిబాబాను గ్రామంలో ఊరేగిం చారు. అలాగే గుంతలపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నందు అరికెలలో వెలసి ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయం నందు, మినికిలో వెలసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం నందు ఏ ఎస్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం నందు గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయాల వద్ద భజన కార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి - మరొకరి పరిస్థితి విషమం

రామసముద్రం (సింధూరదర్శిని): మండలంలోని మినికి బండపై మలుపు వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పుంగనూరు నుండి రామసముద్రం వైపు వస్తున్న టమోటా బొలెరో ను రామసముద్రం నుండి పుంగనూరు వైపు ద్విచక్ర వాహనం లో వెళుతున్న యువకులు కలికిరి మండలం మర్రికుంట పల్లికి చెందిన సాయి తేజ (18) ( డిగ్రీ ప్రథమ సంవత్సరం) మృతి చెందగా, లింగాపురం సమీపంలోని మత్తిగానిపల్లి కి చెందిన టీ గణేష్ (19) (డిగ్రీ తృతీయ సంవత్సరం) తీవ్ర గాయాల పాలు అయ్యారు. ఘటన జరిగిన తక్షణమే అక్కడున్న ప్రజలు 108 సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం: కమిషనర్ వై ఓ నందన్



నెల్లూరు (సింధూరదర్శిని)29 జూలై నెల్లూరు జిల్లా; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ బుధవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జోనల్ ఆఫీసర్స్, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశముల మేరకు పరిపాలన సౌలభ్యం దృష్ట్యా క్షేత్రస్థాయిలో నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు గాను నెల్లూరు సిటీ నియోజకవర్గము నాలుగు జోన్లుగా విభజించి వాటికి జోనల్ ఆఫీసర్లుగా

జోన్ 1. షేక్.రేష్మ, అసిస్టెంట్ కమిషనర్, 3,4,5,6, 7,8,9 వార్డులు


జోన్ 2.కె. హిమబిందు, అదనపు కమిషనర్, 10.11, 13,14,15,16,45 వార్డులు

జోన్ 3.ఎన్. వాసు బాబు, టి.పి.ఆర్.ఓ 39,40,41,42,43,44,47

జోన్ 4. డి. భాను ప్రతాప్, 48,49,50,51,52,53,54 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లను జోనల్ ఆఫీసర్లుగా నియమించారు. అలాగే రానున్న కాలంలో నగరంలో అభివృద్ధి పనులు, వాటితో పాటు మెగా వాటర్ కనెక్షన్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎండ్ టు ఎండ్ రోడ్ పనులు పూర్తిస్థాయి పర్యవేక్షణలో అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగము వారు జోనల్ ఆఫీసర్లతో మమేకమై వారి పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో పని చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.


నగరంలో ఎండ్ టు ఎండ్ రోడ్లు శుభ్రముగా ఉంచాలని, క్రమం తప్పకుండా డీసిల్టేషన్ జరిపించాలని, కన్స్ట్రక్షన్ మరియు డెమోలిషన్ వేస్ట్ మెటీరియల్ ను పినాకిని పార్కులో అక్కడికి తరలించాలని సూచించారు. నెల్లూరు నగరం గార్బేజి ఫ్రీ సిటీగా ఉండునట్లు డోర్ టు డోర్ చెత్త సేకరణ 100% పూర్తిగా జరగాలని ప్రతిరోజు జోనల్ ఆఫీసర్లు అందరూ పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అదనపు కమిషనర్ హిమబిందు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రహంతు జానీ, టి.పి. ఆర్. ఓ. వాసు బాబు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దినేష్, మలేరియా విభాగం డాక్టర్ జిజియా, టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాధరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అనిల్ కుమార్, చంద్రయ్య, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ నరసింహారావు, శానిటరీ సూపర్వైజర్లు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, అమినిటీస్ వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం:డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్



సత్తెనపల్లి, సింధూరదర్శిని: రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు.వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వ విజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారానికి పాల్పడుతోందని విమర్శించారు. మెగా డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరిగాయో ఆధారాలతో నిరూపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలుమార్లు బహిరంగ సవాల్ విసిరినా, వైసీపీ నాయకత్వం అందుకు స్పందించలేదని అన్నారు. ఆరోపణలు చేయడం కంటే వాటిని వాస్తవాలతో నిరూపించడం ముఖ్యమని పేర్కొన్నారు.డీఎస్సీ నియామకాలపై కోర్టులను ఆశ్రయించిన వైసీపీ వర్గాలు తమ వాదనలను న్యాయస్థానాల్లో నిలబెట్టుకోలేక చివరకు కేసులను ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. ఇప్పుడు కొత్త అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వివిధ కోర్టుల్లో దాఖలైన దాదాపు 240 కేసులను ఎదుర్కొంటూనే కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని చెప్పారు. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అర్హతతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభను ప్రశ్నించడం, వారి కుటుంబాల ఆనందాన్ని రాజకీయాల కోసం బలిపెట్టడం సమంజసం కాదన్నారు. వైసీపీ నిర్వహిస్తున్న డీఎస్సీ ఆందోళనల్లో నిజమైన డీఎస్సీ అభ్యర్థులు లేదా నిరుద్యోగ యువత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.గత ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ అమలులో విఫలమైన వైసీపీకి డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదని డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన సమయంలో తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

## వైభవంగా సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు:కిక్కిరిసిన భక్తజనం



సత్తెనపల్లి, సింధూరదర్శిని:మండల కేంద్రం క్రోసూరు లో ఎంతోమంది భక్తులకు ఆరాధ్య దైవంగా వెళుతూ వెలుగొందుతున్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగాయి గురుపౌర్ణమి సందర్భంగా తెల్లవారు జాము నుంచే సాయిబాబా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది సాయినాధుడికి ప్రత్యేక అలంకరణలు మహాభిషేకం హారతులు వేదమంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు సాయంత్రం ప్రత్యేకంగా శ్రీ సాయి బాబా వారికి పల్లకి సేవ నిర్వహించారు మండల నలుమూలల నుంచి భక్తులు బాబా వారి ఆశీస్సులు పొందేందుకు బారులు తీరారు దీంతో శ్రీ సాయి జయ జయ సాయిరాం నినాదారులతో ఆలయ పరిసరాలు మారుమోగాయి మన సంస్కృతిలో గురువుకు తల్లిదండ్రుల తర్వాత విశిష్ట స్థానం ఉంటుంది మంచి చెడుల విచక్షణను తెలియజేసేది గురువు దీంతో గురు పూర్ణిమ రోజు గురుపూజ త్రిమూర్తుల సేవకు సమానంగా భావిస్తారు ఈ సందర్భంగా వేకువ జాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు సాయిబాబా వారిని ప్రార్థిస్తూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా భక్తులు కోరుకున్నారు ఆలయ అర్చకులు ఆలయానికి వచ్చిన భక్తులకు వేదమంత్రోచరణలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబా వారి ఆశీస్సులనందించి తీర్థ ప్రసాదాలను అందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పించారు భక్తుల సహాయ సహకారాలతో ప్రత్యేకంగా తయారు చేసిన పులిహోర చక్కెర పొంగలి పరమాన్నం శనగ గుగ్గిళ్లు బూంది స్వీటు తదితర ఐదు రకాల ప్రసాదాలను భక్తులకు అందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు మాట్లాడుతూ క్రోసూరు అచ్చంపేట మండలాల నుండి సాయి భక్తులు ఈ గురు పౌర్ణమికి వచ్చినట్లు ఎప్పుడూ ఇంతమంది భక్తులను చూడలేదని భక్తుల సంతోషంగా చెప్పుకోవటం సంతోషకరమన్నారు సుమారు రెండు వేల మంది భక్తులు బాబా వారి దర్శనం చేసుకున్నట్లు తెలియపరిచారు



## మానసాదేవి అమ్మవారికి ఆషాడ సారె సమర్పణ

నరసరావుపేట సింధూరదర్శిని: బుధవారం ఉదయం నరసరావుపేట పట్టణం లింగుంట్ల కాలనీ రాజు నగర్ వద్ద శ్రీ మానసా దేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో రంగవఝ్ఝల కోటేశ్వర శాస్త్రి గారి ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ఆషాడ సారె సమర్పించడం జరిగింది. అమ్మవారికి చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పూలు,గాజులు, గోరింటాకు ప్యాకెట్లు, స్వీట్స్, హాట్స్, పండ్లు, చలిమిడి మొదలగునవి సమర్పించడం జరిగినది. మహిళచే శ్రీచక్రమునకు కుంకుమ పూజలు జరిగినవి. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు దంపతులు మరియు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. తదుపరి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.





## ఉపాధి హామీ వేతనాల బకాయిలను వెంటనే ఇవ్వాలి



క్రోసూరు సింధూరదర్శిని: ఉపాధి హామీ వేతనాల బకాయిలను వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. సామాజిక శంఖారావం లో భాగంగా అందుకూరు,బాలమర్రు గ్రామాలలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు చేసి, రెండు నెలలు కావస్తున్నప్పటికీ బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు, పనులు లేక ఇబ్బంది పడుతుంటే శాంక్షన్ అయిన పనులు లేవని డిమాండ్ పెట్టలేదని, వ్యవసాయ కార్మిక సంఘం కమిటీకి తమ ఆవేదనను తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు మాట్లాడుతూ, ఉపాధి హామీ పాత చట్టాన్ని రద్దుచేసి, జి రాంజీ పేరుతో నూతన చట్టం తీసుకువచ్చిన దగ్గరనుండి, ఈ ఉపాధి హామీ బిల్లులు చెల్లించడం జరగడంలేదని , అందుకు కారణం కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టంలో మార్పులేనని అన్నారు. కేంద్రం ఉపాధి హామీ బిల్లు చెల్లించాలంటే, నూతన చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన , 40 శాతం వాటాన్ని చెల్లిస్తేనే కేంద్ర ప్రభుత్వం తమ నిధులు మంజూరు చేస్తామని , బిల్లులు చెల్లించకుండా ఆపివేయడం వలన వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఒకసారి చేసిన పనిని ఐదు సంవత్సరాలు వరకు ప్రాంతంలో పనిచేయకూడదు అనే నిబంధన పెట్టడం వలన పనులను గుర్తించడం శాంక్షన్ చేయటం కష్టంగా ఉండి కూలీలకు పనులు కల్పించడం అధికారులకు కూడా ఇబ్బందిగా మారిందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రాలు ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జి రాంజీ ఉపాధి హామీ చట్టం, రాష్ట్ర ప్రభుత్వాలకు భారం అవుతుందని పదేపదే ప్రజా సంఘాలు చెప్పినప్పటికీ ఈ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు మాట్లాడకుండా , ప్రస్తుతం నూతన చట్టప్రకారం బిల్లులు చెల్లించకుండా , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు.

అప్పటికైనా నూతన చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని అమలులోకి తీసుకొని వచ్చేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముందుకు రావాలని, లేకుంటే ఉపాధి హామీ చట్టం పూర్తిగా ప్రమాదంలో పడి, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చిలుక యేసయ్య హనుమంతరావు వ్యవసాయ కార్మికులు పాల్గొనడం జరిగింది.



## అమరావతీ ఛాంపియన్ షిప్ 2026 పోటీలలో సత్తా చాటిన జై భారత్ స్కూల్ విద్యార్థులు

సత్తెనపల్లి, సింధూరదర్శిని: గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసే లక్ష్యంతో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్–2026 క్రీడా పోటీలు బుధవారం అచ్చంపేట మండలం అచ్చంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో క్రోసూరు జై భారత్ స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటినట్లు జై భారత్ స్కూల్ డైరెక్టర్ జైనేంద్ర రెడ్డి తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో అండర్ 17 విభాగంలో షాట్ పుట్ లో యూ. ఈశ్వర్, కే.జ్ఞాన మాధురి, జి.మోహన లక్ష్మి, ఖో ఖో ఆటలో బి.రాహుల్, వై.కుశిలయ, యన్.తేజస్వి, చెస్ ఆటలో షేక్ ఆరిఫ్‌లు విజయం సాధించి జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ 2026 పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి తన ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ 2026 పోటీలకు ఎంపికైన విద్యార్థులను జై భారత్ స్కూల్ డైరెక్టర్ జైనేంద్ర రెడ్డి, ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు అభినందించారు.

## ఘనంగా చీఫ్ విప్ జీవి, లీలావతి దంపతుల షష్టిపూర్తి మహోత్సవం



వినుకొండ-సింధూరదర్శిని: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, ధర్మపత్ని లీలావతి దంపతుల షష్టిపూర్తి మహోత్సవం బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు కొంతమంది ఆత్మీయులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ మక్కేన మల్లికార్జునరావు దంపతులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవి కుటుంబ సభ్యులు సన్నిహితులు పాల్గొన్నారు.

## స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థినికి రూ.20వేల ఆర్థిక సహాయం



సింధూరదర్శిని: స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన బీటెక్ విద్యార్థిని లిపరిటాల హేమలతలికు హాస్టల్ ఫీజు కోసం రూ.20 వేల చెక్కును కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.వి.ఎన్. ప్రసాద్ అందజేశారు. హేమలత గుంటూరులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఐటీ) చివరి సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.వి.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో చదువులు మధ్యలో నిలిచిపోకుండా పేద విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సహాయం అభినందనీయమని అన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత హేమలత కూడా మరో కొంతమంది విద్యార్థులకు చేయూతనివ్వాలని సూచించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు ఖాసీ నాయక్, కామర్స్ అధ్యాపకుడు పున్నయ్య, స్నేహహస్తాలు ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ మంచి చేయడమే ప్రభుత్వ ధ్యేయం



మాచర్ల, సింధూరదర్శిని: ప్రతి ఇంటికీ మంచి చేయడమే ధ్యేయంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగిస్తూ ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతలతండా, చెంచుకాలనీ, కంభంపాడు గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం, ప్రతి ఇంటికీ జూలకంటి ప్రచార కార్యక్రమాన్ని గౌతమ్ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మాచర్ల మండలం దశాబ్దాలుగా మరుగున పడిన అభివృద్ధి నేడు ఎమ్మెల్యే జూలకంటి హయంలో పరుగులు పెడుతోందని చెప్పారు. మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,వజ్రం నాయక్,రమావత్ రాజ్ కుమార్, స్వామినాయక్, హరి, బావోసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తత్కాల్ టికెట్ల కోసం పశ్చిమ మధ్య రైల్వే కొత్త రూల్స్..

ఆగస్టు 1 నుంచి మారనున్న టోకెన్ల విధానం!

పశ్చిమ మధ్య రైల్వేలో తత్కాల్ టికెట్లపై కొత్త టోకెన్ విధానం

ఏసీ, నాన్-ఏసీ టోకెన్ల జారీ సమయాల్లో మార్పులు

టోకెన్ల కోసం ఆధార్, ఫోటో ఐడీ తప్పనిసరి

కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించడమే లక్ష్యమన్న రైల్వే అధికారులు



రైల్వే స్టేషన్లలో తత్కాల్ టికెట్ల కోసం గంటల తరబడి క్యూలలో వేచి చూసే ప్రయాణికులకు పశ్చిమ మధ్య రైల్వే ఊరటనిచ్చే వార్తను అందించింది. కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించడంతో పాటు, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఆగస్టు 1 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం సవరించిన టోకెన్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. నూతన నిబంధనల ప్రకారం, ఏసీ క్లాసుల కోసం ఉదయం 8:30 నుంచి 9:00 గంటల మధ్య, నాన్-ఏసీ (స్లీపర్) క్లాసుల కోసం ఉదయం 9:00 నుంచి 9:30 గంటల మధ్య టోకెన్లు జారీ చేస్తారు. ప్రతి కౌంటర్‌లో ఏసీ క్లాసుకు గరిష్ఠంగా 10, నాన్-ఏసీకి 15 టోకెన్లు కేటాయిస్తారు. అయితే, రద్దీ తీవ్రతను బట్టి ఈ సంఖ్యను సవరించే అధికారం స్థానిక అధికారులకు ఉంటుంది. గతంలో టోకెన్లు ఆలస్యంగా జారీ చేయడం వల్ల ప్రయాణికులు రెండుసార్లు కౌంటర్‌కు రావాల్సి వచ్చేది. కొత్త సమయాల వల్ల ఆ సమస్యకు పరిష్కారం లభించనుంది.

టోకెన్ల జారీలో పారదర్శకతను పెంచేందుకు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు కఠిన నిబంధనలను రూపొందించారు. టోకెన్ పొందే ప్రయాణికులు తమ ఆధార్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన మరో గుర్తింపు కార్డును తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ టోకెన్లు బదిలీ చేయడానికి వీలుండదు. స్వయంగా ప్రయాణించే వారికి లేదా తమ కుటుంబ సభ్యులకు టికెట్లు బుక్ చేసుకునే వారికి (కేటగిరీ-ఏ) మొదటి ప్రాధాన్యత కల్పిస్తారు. ఈ మార్పులను కోటా డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సౌరభ్ జైన్ ధృవీకరించారు. కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

# ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ సేవలు.. విశాఖలో వాణిజ్య విమానాలకు టాటా

ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ నుంచి వాణిజ్య విమాన సేవలు

విశాఖపట్నం సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన కార్యకలాపాలకు ముగింపు

కొత్త విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం

ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

రికార్డు స్థాయిలో 31 నెలల్లోనే పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్



విశాఖపట్నం విమానయాన చరిత్రలో ఒక శకం ముగిసి, కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఆగస్టు 17వ తేదీ నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య విమాన సర్వీసులు పూర్తిగా నిలిచిపోనున్నాయి. వాటి స్థానంలో విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టు 17వ తేదీ అర్ధరాత్రి 00.01 గంటల నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య కార్యకలాపాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అదే సమయం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ లోని సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన సేవలు ఆగిపోతాయి. అయితే, జాతీయ అత్యవసర సమయాల్లో, భారత వాయుసేన, ఇతర సాయుధ దళాలు, పోలీసు విభాగాలు, ప్రభుత్వ వీఐపీ విమానాల రాకపోకలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయ కోడ్ "VTZ" ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. ఈ నూతన విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దాదాపు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే, కేవలం 31 నెలల్లో దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులన్నీ లభించాయి.

మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

2,703 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాలు విమానాశ్రయానికి, మిగిలినవి ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీలకు కేటాయించారు. బోయింగ్ 777, డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330 వంటి భారీ విమానాలు సైతం సులభంగా దిగేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, స్మార్ట్ సర్వైలెన్స్ వంటి సాంకేతికతలతో ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభూతిని అందించేలా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు.

# రోజుకు ఎన్ని గుడ్లు తినాలి?.. ఈ విషయాలు తెలుసా?

ఆరోగ్యవంతులు రోజుకు ఒక గుడ్డు తినడం సురక్షితమంటున్న నిపుణులు - గుడ్లలోని కొలెస్ట్రాల్‌పై అపోహలు పెట్టుకోవద్దని సూచన

వేయించడం కన్నా ఉడకబెట్టిన గుడ్డు తినడమే ఆరోగ్యకరం - గుడ్డులోని పచ్చసొనలో కీలక పోషకాలు ఉంటాయని వెల్లడి



గుడ్లు సంపూర్ణ పోషకాహారమని అందరికీ తెలుసు. అయినప్పటికీ, రోజుకు ఎన్ని గుడ్లు తినాలనే దానిపై చాలామందిలో సందేహాలు, అపోహలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గుడ్లలోని కొలెస్ట్రాల్ గుండె ఆరోగ్యానికి హాని చేస్తుందనే ప్రచారం చాలాకాలంగా ఉంది. అయితే, ఆధునిక పరిశోధనలు, పోషకాహార నిపుణులు ఈ విషయంలో స్పష్టతనిస్తున్నారు. ఆరోగ్యవంతులైన చాలామందికి మితమైన సంఖ్యలో గుడ్లు తినడం పూర్తిగా సురక్షితమని, పైగా ఆరోగ్యానికి మేలు చేస్తుందని వారు అంటున్నారు.

### పోషకాల గని గుడ్డు

గుడ్డును ఒక 'న్యూట్రియంట్-డెన్స్ ఫుడ్'గా పరిగణిస్తారు. ఒక పెద్ద గుడ్డులో దాదాపు 6 నుంచి 7 గ్రాముల అధిక నాణ్యత గల ప్రోటీన్ ఉంటుంది. ఇందులో శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి, మరమ్మతులకు ఎంతగానో దోహదపడతాయి. ప్రోటీన్‌తో పాటు కోలిన్, విటమిన్ డి, విటమిన్ బి12, సెలీనియం వంటి కీలక పోషకాలు కూడా గుడ్డులో పుష్కలంగా ఉంటాయి. చాలామంది పచ్చసొన తినడానికి ఇష్టపడరు, కానీ అసలైన పోషకాలు అందులోనే దాగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. విటమిన్లు ఎ, డి, ఇ, బి12తో పాటు కంటి చూపు, మెదడు ఆరోగ్యానికి మేలు చేసే ల్యూటిన్, జియాక్సంతిన్ వంటి సమ్మేళనాలు పచ్చసొనలోనే ఉంటాయి. అందువల్ల గుడ్డును పచ్చసొనతో కలిపి తినడమే శ్రేయస్కరం.

### కొలెస్ట్రాల్ భయాలు.. వాస్తవాలు

గతంలో గుడ్లలోని కొలెస్ట్రాల్ కారణంగా వాటిని తినడాన్ని చాలామంది నిపుణులు పరిమితం చేశారు. అయితే, ఇటీవలి పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని మార్చాయి. ఆహారం ద్వారా తీసుకునే కొలెస్ట్రాల్‌కు, రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలకు ప్రత్యక్ష సంబంధం చాలా తక్కువని తేలింది. మన మొత్తం ఆహారంలో ఉండే సంతృప్త కొవ్వు (ఞ్ఘబతీఫ్వస టఫ్) రక్త కొలెస్ట్రాల్‌ను పెంచడంలో పెద్ద పాత్ర పోషిస్తుంది. అందుకే, గుడ్డును వేయించిన మాంసం లేదా అధిక కొవ్వు పదార్థాలతో కాకుండా, కూరగాయలు, తృణధాన్యాలతో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా రోజుకు ఒక గుడ్డు తినడం చాలామందికి సురక్షితమేనని సూచించింది.

### ఎవరు ఎన్ని తినాలి?

ఈ విషయంలో అందరికీ ఒకే నియమం వర్తించదు. పోషకాహార నిపుణుల ప్రకారం.. ఆరోగ్యంగా ఉన్న పెద్దలు సమతుల్య ఆహారంలో భాగంగా రోజుకు ఒక గుడ్డు చొప్పున, వారానికి మూడు నుంచి నాలుగు సార్లు తీసుకోవచ్చు. ఎదుగుతున్న పిల్లలు వారి పెరుగుదలకు అవసరమైన పోషకాల కోసం రోజుకు ఒక గుడ్డు తినవచ్చు. అయితే, ఇప్పటికే గుండె జబ్బులు లేదా అధిక ఎల్‌డీఎల్ (చెడు) కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్న వారు మాత్రం గుడ్లు తినే విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

వండే విధానం కూడా చాలా ముఖ్యం. నూనెలో వేయించిన గుడ్ల కన్నా ఉడకబెట్టిన, పోచ్ చేసిన లేదా తక్కువ నూనెతో చేసిన ఆమ్లెట్ వంటివి ఆరోగ్యకరమైనవి. గుడ్లలో ఫైబర్ ఉండదు కాబట్టి, ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలతో కలిపి తీసుకుంటే అది సంపూర్ణ భోజనం అవుతుంది. మొత్తంమీద గుడ్లను సమతుల్య ఆహార ప్రణాళికలో భాగంగా మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ఐపీఎల్‌లో అత్యంత విలువైన టీమ్ ఇదే!

ఐపీఎల్ విలువ రూ.1.97 లక్షల కోట్లు

ఆర్సీబీ బ్రాండ్ విలువ రూ.2,987 కోట్లు

సీఎస్‌కే నాలుగో స్థానానికి పరిమితం

ఆర్సీబీ, రాజస్థాన్‌కు కొత్త యాజమాన్యాలు

ఎస్ఆర్‌హెచ్ ఐదు, ఆర్ఆర్ ఆరో స్థానం

డిజిటల్ వృద్ధితో ఐపీఎల్‌కు మరింత బలం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా మరింత బలపడింది. హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వాల్యుయేషన్ స్టడీ ప్రకారం లీగ్ మొత్తం వ్యాపార విలువ రూ.1,97,024.68 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం పెరిగింది. లీగ్ బ్రాండ్ విలువ కూడా రూ.41,106 కోట్లకు చేరి 10.3 శాతం వృద్ధి నమోదు చేసింది.

బ్రాండ్ విలువలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సుమారు రూ.2,987 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రూ.3 వేల కోట్ల మార్కుకు చేరువైన తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ముంబై ఇండియన్స్ దాదాపు రూ.2,528 కోట్లతో రెండో స్థానంలో నిలవగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ సుమారు రూ.2,346 కోట్లతో మూడో స్థానం దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ.2,336 కోట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సుమారు రూ.1,608 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ దాదాపు రూ.1,541 కోట్లతో ఆరో స్థానం దక్కించుకుంది. పంజాబ్ కింగ్స్ రూ.1,513 కోట్లతో ఏడు, గుజరాత్ టైటాన్స్ సుమారు రూ.1,503 కోట్లతో ఎనిమిదో స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్ దాదాపు రూ.1,494 కోట్లతో తొమ్మిది, లక్నో సూపర్ జెయింట్స్ సుమారు రూ.1,168 కోట్లతో పదో స్థానంలో నిలిచాయి.

2026లో ఫ్రాంచైజీల యాజమాన్యంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌తో కూడిన కన్సార్టియం ఆర్సీబీని సుమారు రూ.17,042 కోట్ల విలువకు కొనుగోలు చేసింది. మరోవైపు మిట్టల్ కుటుంబం, అదర్ పూనావాలా కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను సుమారు రూ.15,797 కోట్ల విలువతో సొంతం చేసుకున్నారు. ఐపీఎల్‌కు ప్రపంచ పెట్టుబడిదారుల నుంచి లభిస్తున్న ఆదరణకు ఈ ఒప్పందాలు నిదర్శనమని నివేదిక పేర్కొంది.

# హిందూ మహాసముద్రంలో తేలియాడుతున్న ఎలాన్ మస్క్ కంపెనీకి చెందిన స్టార్‌షిప్!



ప్రముఖ అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ ప్రయోగించిన స్టార్‌షిప్ పైభాగం, ఇటీవలి పరీక్ష ప్రయోగం అనంతరం హిందూ మహాసముద్రంలో తేలియాడుతోంది. సముద్రంలో సాఫ్ట్ ల్యాండింగ్ అయిన కొన్ని రోజుల తర్వాత కూడా అది సురక్షితంగా ఉండటంతో, దానిని వెలికితీసేందుకు ఒక రికవరీ నౌకను పంపిస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ధృవీకరించారు.

ఇటీవల నిర్వహించిన 'ఫ్లైట్ 13' పరీక్షలో భాగంగా, ఈ స్టార్‌షిప్ నియంత్రిత పద్ధతిలో భూవాతావరణంలోకి పునఃప్రవేశించి, హిందూ మహాసముద్రంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. గత ప్రయోగాల్లోని వ్యోమనౌకల మాదిరిగా కాకుండా, ఇది సముద్ర జలాలను తాకిన తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఉండి, టెలిమెట్రీ డేటాను నిరంతరం పంపిస్తోంది. ఈ అనూహ్య పరిణామ నేపథ్యంలో, సదరు స్పేస్‌క్రాఫ్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని స్పేస్‌ఎక్స్ నిర్ణయించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఎలాన్ మస్క్, స్టార్‌షిప్‌ను వెలికితీసేందుకు ప్రత్యేక నౌకను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఉప్పునీటి ప్రభావం వల్ల ఈ వ్యోమనౌకను తదుపరి ప్రయోగాలకు వినియోగించకపోయినప్పటికీ, భూ వాతావరణంలోకి ప్రవేశించే క్రమంలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడిని తట్టుకున్న దాని హీట్ షీల్డ్, ఇతర సాంకేతిక వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఇది దోహదపడుతుందని ఇంజనీర్లు భావిస్తున్నారు. చంద్రుడు, అంగారక గ్రహాలపైకి మానవులను చేరవేసే లక్ష్యంతో స్పేస్‌ఎక్స్ ఈ స్టార్‌షిప్‌ను అభివృద్ధి చేస్తోంది. సుమారు 50 మీటర్ల పొడవున్న ఈ వ్యోమనౌక పైభాగం, నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలోనూ కీలక పాత్ర పోషించనుంది. ప్రస్తుతం డ్రోన్లు, ఇతర సెన్సర్ల సాయంతో స్టార్‌షిప్ స్థితిగతులను సాంకేతిక బృందాలు పర్యవేక్షిస్తుండగా, దానిని సముద్రం నుంచి వెలికితీసేందుకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

# భారత పర్యాటకులకు గుడ్‌న్యూస్.. యూపీఐతో బుర్జ్ ఖలీఫా టికెట్లు

బుర్జ్ ఖలీఫాకు ఆన్‌లైన్‌లో యూపీఐ ద్వారా టికెట్ల బుకింగ్

భారత పర్యాటకుల కోసం కొత్తగా అందుబాటులోకి వచ్చిన సేవలు

యూఏఈలో ఈ-కామర్స్ కోసం యూపీఐని స్వీకరించిన తొలి సంస్థ

ఎన్‌పీసీఐ, నియోపే, ఈమార్‌ల భాగస్వామ్యంతో అమలు



భారతీయ పర్యాటకులకు గుడ్‌న్యూస్. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను సందర్శించేందుకు ఇప్పుడు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఆన్‌లైన్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. యూఏఈలో ఈ-కామర్స్ లావాదేవీల కోసం యూపీఐ చెల్లింపులను స్వీకరిస్తున్న తొలి సంస్థగా బుర్జ్ ఖలీఫా నిలిచింది. ఈ సేవలను ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), నియోపే, ఈమార్ ఎంటర్‌టైన్‌మెంట్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త సదుపాయంతో భారత పర్యాటకులు యూఏఈకి ప్రయాణానికి ముందే బుర్జ్ ఖలీఫా అధికారిక వెబ్‌సైట్ నుంచి తమకు నచ్చిన యూపీఐ యాప్‌తో సులభంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. యూఏఈలో 2022లోనే క్యూఆర్ కోడ్ ఆధారిత యూపీఐ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. నియోపే నెట్‌వర్క్‌లోని వ్యాపార సంస్థల వద్ద భారత పర్యాటకులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పుడు ఈ సేవలను ఆన్‌లైన్ బుకింగ్స్‌కు కూడా విస్తరించారు. ఈ సందర్భంగా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ ఎండీ, సీఈఓ రితేశ్ శుక్లా మాట్లాడుతూ.. "విదేశాలకు వెళ్లినప్పుడు భారత పర్యాటకులు సులభమైన, సుపరిచితమైన చెల్లింపు అనుభవాన్ని కోరుకుంటున్నారు. ఈ సదుపాయంతో వారు యూఏఈకి రాకముందే తమకు అలవాటైన యూపీఐతో టికెట్లు బుక్ చేసుకోవచ్చు" అని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఈ-కామర్స్ కోసం యూపీఐ సేవలను ప్రారంభించిన తొలి సంస్థ తమదేనని నియోపే సీఈఓ విభోర్ ముంధాడా అన్నారు. తమ వద్దకు అత్యధికంగా వచ్చే అంతర్జాతీయ సందర్శకులలో భారతీయులు ఒకరని, ఈ కొత్త విధానం వారి బుకింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తుందని ఈమార్ ప్రతినిధి పేర్కొన్నారు.

# వన్డేల్లో గిల్, టీ20ల్లో ఇషాన్ టాప్.. 230 స్థానాలు ఎగబాకిన యంగ్ సెన్సేషన్ వైభవ్!

వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానానికి చేరిన గిల్ - టీ20 బ్యాటర్ల జాబితాలో నం.01 ర్యాంకును నిలబెట్టుకున్న ఇషాన్

టీ20ల్లో 230 స్థానాలు ఎగబాకి టాప్ 50లోకి దూసుకొచ్చిన సూర్యవంశీ

టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 31 స్థానాలు మెరుగుపరుచుకున్న బిష్ణోయ్



ఐసీసీ తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వన్డే బ్యాటింగ్ చార్టుల్లో మళ్లీ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకోగా, 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ టీ20ల్లో సంచలనం సృష్టించాడు. జింబాబ్వేతో సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో ఏకంగా 230 స్థానాలు ఎగబాకి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇటీవల హరారేలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించిన వైభవ్ సూర్యవంశీ, 50.33 సగటుతో 151 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకున్నాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 230 స్థానాలు మెరుగుపరుచుకుని, తొలిసారి టాప్ 50లోకి అడుగుపెట్టి 48వ ర్యాంకులో నిలిచాడు.

మరోవైపు టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో 81 పరుగుల ఇన్నింగ్స్‌తో రాణించిన కిషన్, ప్రస్తుతం 910 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇదే సిరీస్‌లో అతను తన కెరీర్ బెస్ట్ 916 పాయింట్లను కూడా అందుకున్నాడు. టీ20 బ్యాటింగ్ ఆల్-టైమ్ రేటింగ్స్‌లో అభిషేక్ శర్మ (931), డేవిడ్ మలన్ (919) తర్వాత ఇది మూడో అత్యధికం.

ఇదే జాబితాలో తిలక్ వర్మ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 6వ ర్యాంకుకు, శ్రేయస్ అయ్యర్ ఏడు స్థానాలు ఎగబాకి 24వ ర్యాంకుకు చేరుకున్నారు. బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ 31 స్థానాలు దూసుకెళ్లి 41వ ర్యాంకును దక్కించుకున్నాడు.

ఇక, వన్డే ఫార్మాట్‌లో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ అగ్రస్థానం నుంచి కిందకు జారడంతో శుభ్‌మన్ గిల్‌కు మళ్లీ నంబర్ వన్ కిరీటం దక్కింది. మిచెల్ జనవరి నుంచి అగ్రస్థానంలో ఉండగా, ఇటీవల అంతర్జాతీయ మ్యాచ్‌లకు దూరంగా ఉండటం గిల్‌కు కలిసొచ్చింది. టెస్ట్ క్రికెట్‌లోనూ పలువురు ఆటగాళ్లు తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. పాకిస్థాన్‌పై అద్భుతంగా రాణించిన వెస్టిండీస్ ఆల్-రౌండర్ జస్టిన్ గ్రీవ్స్, బౌలర్ల జాబితాలో 21 స్థానాలు ఎగబాకి 48వ ర్యాంకును, ఆల్-రౌండర్ల జాబితాలో 9వ ర్యాంకును అందుకున్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని టెస్ట్ బ్యాటింగ్‌లో 15వ స్థానంలో నిలిచాడు.

# ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనం.. కేంద్రం కొత్త ఆదేశాలు

అదనపు బాధ్యతలున్నా రెండో కారు ఇవ్వొద్దని స్పష్టీకరణ

ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులను అరికట్టడమే లక్ష్యం

పీఎస్‌యూల వాహనాలను సొంత పనులకు వాడొద్దని అధికారులకు సూచన

వినియోగంలో లేని వాహనాలను సురక్షితంగా ఉంచాలని శాఖలకు ఆదేశం




ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం 'ఒక అధికారికి-ఒకే కారు' విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమోరాండం జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.

కొత్త నిబంధనల ప్రకారం, ఇప్పటికే ప్రభుత్వ వాహన సదుపాయం పొందుతున్న అధికారికి.. వేరే మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ లేదా ఇతర స్వయంప్రతిపత్తి సంస్థల్లో అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ, రెండో వాహనాన్ని కేటాయించకూడదని స్పష్టం చేసింది. సదరు అధికారి తన వద్ద ఉన్న వాహనాన్నే ఆ అదనపు బాధ్యతల నిర్వర్తణకు కూడా ఉపయోగించుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఇవ్వొద్దని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఆదేశించింది. కేవలం వాహనాల సంఖ్యకే ఈ నిబంధనలు పరిమితం కాలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి లేదా పాక్షిక-ప్రభుత్వ సంస్థలకు చెందిన వాహనాలను కేంద్ర ప్రభుత్వ అధికారులు వినియోగించడాన్ని కూడా నిషేధించింది. అయితే, అధీకృత అధికారిక పర్యటనలు లేదా విధుల్లో భాగంగా ప్రయాణించేటప్పుడు మాత్రం మినహాయింపు ఇచ్చింది. ఈ చర్యల ప్రధాన ఉద్దేశం పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడం, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణను మెరుగుపరచడమని ప్రభుత్వం తెలిపింది. వినియోగంలో లేని లేదా మిగులుగా ఉన్న వాహనాలను అనధికారిక పనులకు వాడకుండా వాటిని సురక్షితంగా భద్రపరచాలని కూడా శాఖలకు సూచించింది. పన్ను చెల్లింపుదారుల సొమ్మును బాధ్యతాయుతంగా ఖర్చు చేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. 2022 సెప్టెంబర్‌లో ప్రభుత్వ వాహనాల వినియోగంపై జారీ చేసిన సమగ్ర మార్గదర్శకాలకు అనుబంధంగా ఈ తాజా ఆదేశాలు వచ్చాయి. ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో భాగంగా ఈ సవరించిన నిబంధనలను కఠినంగా పాటించాలని అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలను వ్యయ విభాగం ఆదేశించింది.



# తెలంగాణలోని బొగత జలపాతం ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత

వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

వరద ఉద్ధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలపాత పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు తెలిపారు. వరద తగ్గి పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు పర్యాటకులు పోలీసులు, అటవీ శాఖ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

# ప్రభుత్వాలను ఏఐ అంతం చేస్తుంది: రామ్ గోపాల్ వర్మ

ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియా వేదికగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భవిష్యత్తు రాజకీయాలపై మరోసారి తనదైన శైలిలో సంచలన విశ్లేషణ చేశారు. రాబోయే రోజుల్లో ఏఐ దెబ్బకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల అవసరమే లేకుండా పోతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రభుత్వాలను ఏఐ అంతం చేస్తుందని అన్నారు. ప్రస్తుత పాలనా వ్యవస్థ అంతా నిజాయతీ, నిర్భయం అనే మానవ బలహీనతలపైనే ఆధారపడి నడుస్తోందని ఆర్జీవీ పేర్కొన్నారు. బదిలీల భయం, పిల్లల చదువులు, లంచాలు, నేతల ఒత్తిళ్లతో అధికారులు లొంగిపోతుంటారని... అదే ఒక అధికారి స్థానంలో 'ఏఐ' ఉంటే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని తెలిపారు. ఏఐకి బదిలీ భయం ఉండదు, దురాశ ఉండదు, అర్ధరాత్రి ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చే మంత్రుల బంధువులకు లొంగదని వర్మ స్పష్టం చేశారు. దుబాయ్‌లో ఇప్పటికే మనుషుల ప్రమేయం లేకుండా పనిచేస్తున్న 'స్మార్ట్ పోలీస్ స్టేషన్ల'ను ఇందుకు ఉదాహరణగా చూపారు. నాయకులు సెలెక్టివ్ డేటాతో డ్రామాలు ఆడుతుంటే.. ఏఐ మాత్రం శాటిలైట్ సమాచారం, వాతావరణం, మార్కెట్ ధరలను క్షణాల్లో విశ్లేషించి కచ్చితమైన పరిష్కారాన్ని కళ్లముందు ఉంచుతుందన్నారు. ప్రజాప్రతినిధులు మధ్యవర్తులుగా పనిచేసే వ్యవస్థను ఏఐ పారదర్శకంగా మార్చేస్తే, నాయకుల స్వార్థ రాజకీయాలు సాగవని వ్యాఖ్యానించారు. ఆర్థిక అభివృద్ధి, రక్షణ బడ్జెట్ వంటివి మానవ నైతిక నిర్ణయాలని కొందరు వాదించవచ్చు కానీ.. ఇప్పటివరకు నేతలు ఎంతవరకు మానవత్వంతో ఆలోచించారని వర్మ ప్రశ్నించారు.

# అద్దెకు ఐఫోన్.. కొత్త సేవ ప్రారంభించిన యాపిల్

అమెరికాలో యాపిల్ కొత్త లీజు పథకం - ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌లకు నెలవారీ లీజు

క్లార్నాతో కలిసి 'అప్‌గ్రేడ్' సేవ - ఐఫోన్ లీజు నెలకు 17.99 డాలర్ల నుంచి

గడువు తర్వాత కొనుగోలు లేదా అప్‌గ్రేడ్ అవకాశం - సెప్టెంబర్‌లో కొత్త ఐఫోన్‌లకు ముందే కీలక నిర్ణయం




అమెరికాలో యాపిల్ వినియోగదారులకు సంస్థ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్ వంటి పరికరాలను ఒకేసారి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా నెలవారీ లీజు పద్ధతిలో వినియోగించుకోవచ్చు. ఇటీవల మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ ప్రభావంతో పలు ఉత్పత్తుల ధరలను యాపిల్ 100 నుంచి 500 డాలర్ల వరకు పెంచిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వినియోగదారులపై ఒకేసారి పడే ఆర్థిక భారం తగ్గించడమే ఈ కొత్త పథకం లక్ష్యంగా కనిపిస్తోంది. 'అప్‌గ్రేడ్' పేరుతో తీసుకొచ్చిన ఈ లీజు పథకాన్ని 'బై నౌ.. పే లేటర్' సేవలు అందించే క్లార్నాతో కలిసి యాపిల్ అమలు చేస్తోంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో లేదా యాపిల్ స్టోర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇందుకు సాఫ్ట్ క్రెడిట్ చెక్ తప్పనిసరి. ఐఫోన్‌లు, యాపిల్ వాచ్‌లను 12 లేదా 24 నెలల కాలానికి లీజుకు తీసుకోవచ్చు. మ్యాక్‌లు, ఐప్యాడ్‌లకు 24 లేదా 36 నెలల కాలపరిమితి ఉంటుంది. ఈ పథకంలో అత్యంత తక్కువ ధర ఐఫోన్‌కు నెలకు 17.99 డాలర్లు చెల్లిస్తే సరిపోతుంది. లీజు గడువు పూర్తయ్యాక వినియోగదారులకు పలు ఎంపికలు ఉంటాయి. మిగిలిన మొత్తాన్ని చెల్లించి అదే డివైజ్‌ను శాశ్వతంగా సొంతం చేసుకోవచ్చు. లేదా తిరిగి ఇచ్చేసి పథకం నుంచి వైదొలగవచ్చు. కొత్త మోడల్‌కు మారాలనుకుంటే మరో లీజు ఒప్పందం చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. పరికరాన్ని కొనుగోలు చేసే సందర్భంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అయితే మొత్తం ఖర్చు ఆ ఉత్పత్తి అసలు ధరను మించదని సంస్థ తెలిపింది. ఈ పథకంలో ఐఫోన్ 17 సిరీస్, ఐఫోన్ ఎయిర్, యాపిల్ వాచ్ సిరీస్ 11, యాపిల్ వాచ్ అల్ట్రా 3, మ్యాక్‌బుక్ ఎయిర్, మ్యాక్‌బుక్ ప్రో, ఐమ్యాక్, మ్యాక్ స్టూడియో, ఐప్యాడ్ ఎయిర్, ఐప్యాడ్ ప్రో, ఐప్యాడ్ మినీ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. అయితే ఐఫోన్ 16, బేసిక్ ఐప్యాడ్, మ్యాక్‌బుక్ నియో, యాపిల్ వాచ్ ఎస్ఈ వంటి తక్కువ ధర మోడళ్లను ఇందులో చేర్చలేదు. ఇప్పటి వరకు అమలులో ఉన్న ఐఫోన్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌కు బదులుగా ఈ కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. సెప్టెంబర్‌లో కొత్త ఐఫోన్‌లతో పాటు యాపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉందన్న అంచనాల మధ్య ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సినిమా న్యూస్

## రామాయణం - స్పైడర్ మాన్ క్రాస్ కల్చరల్ ప్రమోషన్ స్ట్రాటజీ!




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో గ్లోబల్ స్థాయి ప్రాజెక్టుల ప్రమోషన్స్ పద్ధతులు వేగంగా మారుతున్నాయి. దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకులను ఆకర్షించేందుకు మేకర్స్ తెలివైన వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఈ కోవలోనే బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న గ్లోబల్ ప్రాజెక్ట్ -రామాయణం- ట్రైలర్‌ను హాలీవుడ్ సూపర్ హీరో సినిమా -స్పైడర్ మన్: బ్రాండ్ న్యూ డే- తో పాటు అటాచ్ చేసి విడుదల చేయాలని నిర్ణయించడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రాస్-కల్చరల్ ప్రమోషన్ స్ట్రాటజీ వెనుక భారీ బిజినెస్ వ్యూహం దాగి ఉంది. హాలీవుడ్ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారత దేశం యువతలో ..మల్టీప్లెక్స్ ఆడియన్స్‌లో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. స్పైడర్ మన్ లాంటి గ్లోబల్ ఫ్రాంచైజీకి ఉన్న మాస్ అప్పీల్‌ను క్యాష్ చేసుకుంటూ పౌరాణిక కావ్యం రామాయణం ట్రైలర్‌ను థియేటర్లలో ప్రదర్శించడం ద్వారా అసాధారణమైన రీచ్ సాధించొచ్చని మేకర్స్ భావిస్తున్నారు. హాలీవుడ్ సినిమా కోసం థియేటర్లకు వచ్చే కోట్లాది మంది కనుల ముందు నేరుగా విజువల్ వండర్ ట్రైలర్ పడటంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతాయి. ఈ వినూత్న ప్రమోషనల్ స్ట్రాటజీ భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా ఓవర్సీస్ బాక్సాఫీస్‌ను కూడా టార్గెట్ చేసుకుని ప్లాన్ చేసినట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. హాలీవుడ్ - బాలీవుడ్ కంటెంట్‌ను మిక్స్ చేసి అమలు చేస్తున్న క్రాస్-కల్చరల్ విధానం వల్ల పాశ్చాత్య దేశాల ప్రేక్షకులకు కూడా మన ఇతిహాసాల గొప్పదనం సులభంగా పరిచయం అవుతుంది. గ్లోబల్ ఆడియెన్స్‌ను థియేటర్ల వైపు రప్పించడానికి ఇదొక అద్భుతమైన మార్కెటింగ్ టెక్నిక్‌గా నిలుస్తుంది. భారతీయ సినిమాలను గ్లోబల్ మార్కెట్‌లోకి తీసుకువెళ్లడంలో ఇలాంటి వ్యూహాలు ఎంతో కీలకం. రామాయణం లాంటి యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథను ప్రపంచ స్థాయి ప్రేక్షకులకు చేరవేయాలంటే సరిగ్గా అలాంటిదే గ్లోబల్ రీచ్ ఉన్న హాలీవుడ్ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకోవడం మేకర్స్ దూరదృష్టికి నిదర్శనం. సినిమా విడుదలకు ముందే ప్రేక్షకులలో బలమైన బజ్‌ను క్రియేట్ చేయడానికి ట్రైలర్ అటాచ్‌మెంట్ ప్లాన్ ఎంతో దోహద పడుతుంది. పెద్ద సినిమాల బిజినెస్ పరంగా చూస్తే ఈ రకమైన కొలాబరేటివ్ ప్రమోషన్స్ వల్ల డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు భారీగా పబ్లిసిటీ ఖర్చులు తగ్గుతాయి. గ్లోబల్ స్థాయిలో సినిమాకు అసాధారణమైన హైప్ వస్తుంది. సోషల్ మీడియా యుగంలో విభిన్నమైన మార్కెటింగ్ స్ట్రాటజీ ఇంటర్నేషనల్ ట్రెండింగ్‌లో నిలవడానికి కూడా అవకాశం ఉం టుంది. సినిమా ఇండస్ట్రీలో మారుతున్న వ్యాపార పద్ధతులకు ఇదొక చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. -స్పైడర్ మన్- సినిమాతో -రామాయణం- ట్రైలర్‌ను జత చేయడం అనేది సాధారణ ప్రమోషన్ మాత్రమే కాదు. భారతీయ సినిమా సత్తాను ప్రపంచానికి చాటిచెప్పే శక్తివంతమైన గ్లోబల్ బిజినెస్ వ్యూహం. ఈ సరికొత్త క్రాస్-కల్చరల్ ప్రమోషనల్ స్ట్రాటజీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




## 'ఆదర్శ కుటుంబం': వెంకటేశ్ కూతురిగా యువినా పార్థవి.. నవ్వులు పంచుతున్న కొత్త గ్లింప్స్

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (ఏకే 47). తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. చిత్రయూనిట్ తాజాగా ఈ సినిమాలోని మరో ముఖ్య పాత్రను పరిచయం చేస్తూ ఒక చిన్న వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేష్ కూతురు "సంపూర్ణ" పాత్రలో నటి యువినా పార్థవిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ కొత్త గ్లింప్స్‌లో, చిట్టిబాబు పాత్రలో ఉన్న వెంకటేశ్, రఘుబాబుతో ఇంటి విషయాల గురించి మాట్లాడుతుండగా, వారి కూతురు సంపూర్ణ (యువినా పార్థవి) ఎంతో ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వస్తుంది. "నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను" అని తండ్రితో చెబుతుంది. దానికి చిట్టిబాబు చిరాకు పడుతూ, "ఈసారి కార్ డ్రైవర్‌తోనా, మెకానిక్‌తోనా?" అని అడగటంతో ఈవీడియోలో చూడొచ్చు. తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఈ ఫన్నీ సంభాషణ, సినిమా ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందన్న సంకేతాలను ఇస్తోంది. ఈ గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. చిత్రబృందం వినూత్నంగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెంకటేశ్ ను చిట్టిబాబుగా, ఆయన భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టిని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూతురి పాత్రను కూడా పరిచయం చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, శ్రీనిధి శెట్టి, యువినా పార్థవితో పాటు నివేదా పేతురాజ్, రాజ్ ప్రజ్వల్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



## దేశం దాటిన ప్రతిభ.. రిషబ్ శెట్టికి అంతర్జాతీయ సత్కారం!

కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన రిషబ్ శెట్టి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. 2017లో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈయన.. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చేస్తూ 2016లో రికి, కిరిక్ పార్టీ అనే చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2018లో వచ్చిన బెల్ బాటమ్ చిత్రంలో హీరోగా నటించి నటుడిగా కూడా పరిచయమయ్యారు. వాస్తవానికి ఫిలిం డైరెక్షన్లో డిప్లమా పూర్తి చేసిన ఈయన కన్నడ దర్శకుడు ఏ ఎం ఆర్ రమేష్ వద్ద సైనైడ్ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసి.. 2010లో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. రిషబ్ శెట్టి కి ప్రతిష్టాత్మక అవార్డు.. దాదాపుగా దశాబ్ద కాలానికి పైగా కన్నడ ఇండస్ట్రీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన రిషబ్ శెట్టి.. కాంతారా చిత్రంతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకున్నారు.

2022లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడిగా కూడా పనిచేయడం గమనార్హం. ముఖ్యంగా ఈ ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా అవతరించారు రిషబ్ శెట్టి. ఈ చిత్రానికి ప్రీక్వెల్ గా వచ్చిన కాంతారా చాప్టర్ 1 సినిమా కూడా ప్రపంచవ్యాప్తంగా అంతే గుర్తింపును సొంతం చేసుకుంది. ప్రస్తుతం జై హనుమాన్ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న రిషబ్ శెట్టి కి తాజాగా ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. లీడర్షిప్ ఇన్ సినిమా అవార్డు..

భారతీయ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును తీసుకొచ్చినందుకుగాను ఇండియన్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్ 'లీడర్షిప్ ఇన్ సినిమా' అవార్డుతో రిషబ్ శెట్టిని సత్కరించనున్నారు. ఆస్ట్రేలియాలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రిషబ్ శెట్టికి ఆగస్టు 13వ తేదీన ఈ అవార్డును ప్రధానం చేయబోతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజెన్లు రిషబ్ శెట్టికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఒక్క పేరుతోనే థియేటర్లపై దండయాత్ర! రిషబ్ శెట్టి ప్రస్తుత సినిమాలు..

రిషబ్ శెట్టి ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా ఆయన దర్శకత్వం వహిస్తున్న జై హనుమాన్ సినిమాలో హనుమంతుడిగా నటిస్తున్నారు. అలాగే 18 వ శతాబ్దపు బెంగాల్ నేపథ్యంలో రాబోతున్న ద్విభాష చిత్రంలో కూడా నటిస్తున్నారు. దీనికి అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే చత్రపతి శివాజీ మహారాజ్ సినిమాలో కూడా నటిస్తున్నారు. ఈ చిత్రాలతో పాటు కాంతారా చాప్టర్ 2లో కూడా నటిస్తున్నారు రిషబ్ శెట్టి.. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఏది ఏమైనా ఒకవైపు హీరోగా, మరొకవైపు దర్శకుడిగా సినిమాలను నిర్మిస్తూ దూసుకుపోతున్న రిషబ్ శెట్టి.. నిర్మాతగా కూడా మంచి పేరు సొంతం చేసుకున్నారు. పలు కన్నడ చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ దూసుకుపోతున్న ఈయన.. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ 126వ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు.

## ఫ్రాంచైజ్ కల్ట్ పవర్ అంటే ఇదే... ఒక్క పేరుతోనే థియేటర్లపై దండయాత్ర!

ఈ గురువారం విడుదల కాబోతున్న 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' సినిమా క్రేజ్ చూసి బాక్సాఫీస్ వర్గాలు షాక్ అవుతున్నాయి. ప్రత్యేకంగా ప్రచారాలు చేయక పోయినా సరే, 'స్పైడర్ మ్యాన్' అనే ఒకే ఒక్క బ్రాండ్ నేమ్‌తో భారతదేశంలో అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు క్రియేట్ అవ్వడం హాలీవుడ్ సూపర్ హీరోలకున్న గ్లోబల్ డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. హైదరాబాద్ మల్టీప్లెక్స్‌ల లో ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా టికెట్లు దొరకని పరిస్థితి ఉందంటే ఈ సాలీడు మనిషి మేనియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బాక్సాఫీస్ వద్ద తుఫాన్ కలెక్షన్లు ఖాయం: ఈ సిరీస్ లో సినిమాలు రావడం కొత్త కాకపోయినా, ఈసారి అడ్వాన్స్ బుకింగ్స్ చూస్తుంటే హైప్ మామూలుగా లేదు. మొదటి రోజే ఇండియా వ్యాప్తంగా రూ. 30 కోట్ల నుంచి రూ. 50 కోట్లు లేదా అంతకుమించి భారీ ఓపెనింగ్స్ సాధించడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక ఇటీవల పెద్దగా విజువల్ గ్రాండియర్స్ ఏవీ థియేటర్లలోకి రాకపోవడంతో, గ్రాండ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం సినీప్రియులు ఈ సినిమాపై విపరీతంగా ఎగబడు తున్నారు. ఇతర సినిమాలకు పొంచి ఉన్న ముప్పు: స్పైడర్ మ్యాన్ జోరు చూసి మిగతా సినిమాల నిర్మాతలు టెన్షన్ పడుతున్నారు. పాజిటివ్ టాక్‌తో నడుస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ'కి ఏ-సెంటర్లలో ఈ హాలీవుడ్ బొమ్మ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. ఇక టాక్ బాగున్నా సరే, క్లాస్, మాస్ తేడా లేకుండా అధిక శాతం జనం స్పైడర్ మ్యాన్ షోలకే క్యూ కట్టేలా ఉన్నారు. కొత్త సినిమాలపై తీవ్ర ప్రభావం: ఈ హాలీవుడ్ దండయాత్ర ప్రభావం కొత్తగా వస్తున్న సినిమాలపైనా పడేలా ఉంది. జయకృష్ణ ఘట్టమనేని అరంగేట్ర చిత్రం 'శ్రీనివాస మంగాపురం' టీమ్ కంటెంట్‌పై నమ్మకంతో వస్తున్నప్పటికీ,స్పైడర్ మ్యాన్ వేవ్‌ను తట్టుకోవడం సవాలుగా మారింది. సుమంత్ నటించిన 'న్యూటన్‌థర్డ్ లా'కి కూడా ఇదే సమస్య ఎదురుకానుంది. అందుకేనేమో ఈక్రేజ్ ఊహి ంచే బాలీవుడ్ పెద్ద సినిమాలేవీ ఈ వారంలో రేసులో లేకుండా జాగ్రత్త పడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పంటలు పండిస్తాడట! 'ది ఒడిస్సీ'ని మించేలా అరాచకం: గతంలో 'ది ఒడిస్సీ' వంటి స్లో యాక్షన్ డ్రామానే మన దేశంలో కేవలం పది రోజుల్లో రూ. 100 కోట్లు కొల్లగొట్టింది. అలాంటిది ఇండియాలో భారీ ఫ్యాన్ బేస్ ఉన్న 'స్పైడర్ మ్యాన్' సినిమాకు గనక పాజిటివ్ టాక్ వస్తే బాక్సాఫీస్ వద్ద ఊచకోత కోయడం ఖాయం.



'డబుల్ డెనిమ్' లుక్‌తో ఇంటర్నెట్‌లో సెగలు పుట్టిస్తున్న షామా సికందర్; క్యాజువల్ సౌకర్యాన్ని అద్భుతమైన స్టైల్‌తో మేళవించిన ఈ 'డబుల్ డెనిమ్' దుస్తుల ఎంపికతో ఆమె మరోసారి తన స్టైల్ స్థాయిని పెంచేసింది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662